క్లుప్తంగా

లాలాపేట ఆలయాన్ని సందర్శించిన ఈఓ



పట్నంబజారు: నగరంలోని లాలాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాల కార్యనిర్వహణ అధికారి శుభద్ర ఆలయ పరిస్థితులపై ప్రత్యేక దృష్టి సారించారు. నాజ్‌సెంటర్‌లోని ఆంజనేయస్వామి దేవస్థానానికి సంబంధించి పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో మంగళవారం ఆమె ఆలయాన్ని సందర్శించారు. ఉదయం ఆలయానికి చేరుకుని ప్రసాదం విక్రయం, సిబ్బంది తీరు, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. సిబ్బంది వ్యవహార శైలి సక్రమంగా ఉండాలని సూచించారు. ఉదయం 6 గంటలకు లడ్డూ ప్రసాదం కౌంటర్ తెరిచి ఉంచాలన్నారు. అధిక ధరలకు ఎలాంటి విక్రయం జరుపరాదని ఆదేశించారు. భక్తులు పూజా కార్యక్రమానికి రశీదు పొందాలని కోరారు.

బియ్యం సంచి తూకం కచ్చితంగా ఉండాలి



నెహ్రూ నగర్: బియ్యం బ్యాగ్ తూకం విషయంలో కచ్చితత్వం పాటించాలని లీగల్ మెట్రాలజీ జాయింట్ కంట్రోలర్ ఎం.ఎస్.ఎస్ మాధురి సూచించారు. నగరంలోని గుంటూరు మోడ్రన్ రైస్ మిల్‌లో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీగల్ మెట్రాలజీ ప్యాకేజ్ కమోడిటీస్ రూల్స్ ప్రకారం ప్రతి రైస్ బ్యాగ్ పై డిక్లరేషన్(తయారీ తేదీ, కంపెనీ వివరాలు) తప్పనిసరిగా ఉండాలని చెప్పారు. ఎవరైతే రైస్ ప్యాక్ చేస్తున్నారో వారు తప్పనిసరిగా లీగల్ మెట్రాలజీ శాఖ ద్వారా ప్యాకర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కాటాలో తేడాల్లేకుండా చూసుకోవాలని తప్పనిసరిగా డిపార్టమెంటు నుంచి స్టాంపింగ్ వేయించుకోవాలని వివరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ డెప్యూటీ కంట్రోలర్ షాలెం రాజు, అసిస్టెంట్ కంట్రోలర్ కొండారెడ్డి, ఇన్‌స్పెక్టర్ సునీల్ రాజు పాల్గొన్నారు.

ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలి

నెహ్రూ నగర్: నగరపాలక సంస్థ పరిధిలోని చుట్టుగుంట కేకేఆర్ సినిమా హాల్ వెనకాల అనధికార కట్టడాలు జరుగుతున్నప్పటికీ టౌన్ ప్లానింగ్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని నగరానికి చెందిన గుమ్మడి భారతీ నగర కమిషనర్ పులి శ్రీనివాసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని మంగళవారం ఆమె పేర్కొన్నారు. ఎన్ని ఫిర్యాదులు చేసిన నిర్మాణం ఆగదని ఓ మాజీ ఎమ్మెల్యే బెదిరిస్తున్నారు. దీనిపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

నగరాభివృద్ధిలో బిల్డర్స్ భాగస్వాములు కావాలి

నెహ్రూ నగర్: నగరాభివృద్ధిలో తన బిల్డర్స్ భాగస్వాములు కావాలని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర హామీ ఇచ్చారు. సోమవారం రాత్రి పలకలూరు రోడ్డులోని గుంటూరు క్లబ్‌లో నేరేడ్కో బిల్డర్స్ అసోసియేషన్ సభ్యులు మేయర్‌కు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ అమరావతి రాజధానిలో భాగంగా గుంటూరు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, నగరంలోని బిల్డర్స్ నిర్దేశిత ప్రమాణాలు పాటిస్తూ నిర్మాణాలు చేపట్టాలన్నారు. నగరంలో ఇప్పటికే మహాత్మాగాంధీ ఇన్నర్ రింగ్ రోడ్ మొదటి, రెండో దశ పనులు పూర్తయ్యాయని, 3వ దశ పనులు కూడా త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికే గుంటూరు నగరంలో ప్రధానమైన శంకర్ విలాస్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించుటకు శంకుస్థాపన చేయడం జరిగిందని, సదరు బ్రిడ్జిని కూడా త్వరితగతిన పూర్తి చేయుటకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

దళితులకు ఉన్నతాధికారులు అండగా నిలవాలి

నగరంపాలెం: కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక గ్రామాల్లో దళితుల పరిస్థితి దారుణంగా ఉందని అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల వీరాస్వామి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీపొట్టి శ్రీరాముల నెల్లూరు జిల్లా గూడూరు మండలం దప్పళ్లపాడు గ్రామంలో జరిగిన దళితవాడ సాంఘిక బహిష్కరణను తీవ్రంగా ఖండించారు. అధికారం అండదండలతో పెత్తందారులు గ్రామాల్లో పెత్తనం చెలాయిస్తూ, దళితులపై ఆధిపత్య పోరు కోసం దాడులు చేస్తున్నారని ఆరోపించారు. అదేమని అడిగితే తమకు ఎదురు మాట్లాడుతున్నారని దూషిస్తూ గ్రామాల్లో సాంఘిక బహిష్కరణ చేస్తున్నారని వాపోయారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆ గ్రామాన్ని సందర్శించి, దళితుల సమస్యలను పరిష్కరించి అండగా నిలవాలని అన్నారు.

హెపటైటిస్‌కు వ్యాక్సిన్‌తో చెక్

- ముందస్తు అవగాహనతో వ్యాధికి దూరం
- జీజీహెచ్‌లో ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు
- నెలకు సుమారు రూ.20 వేలు ఖరీదు చేసే మందులు ఉచితం
- హెపటైటీస్ అవగాహన నెల ఇది



హెపటైటిస్ పోస్టర్స్

గుంటూరు మెడికల్: హెపటైటిస్ వ్యాధి ప్రాణాంతకమే. సైలెంట్ కిల్లర్‌గా పిలుస్తుంటారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం ప్రతి ముగ్గురిలో ఒకరు వ్యాధితో బాధపడుతున్నారు. 80 శాతం మంది ప్రజలకు వ్యాధిపై, వైద్య చికిత్సలపై అవగాహన లేదు. దీంతో ప్రతి ఏడాది మే నెలను హెపటైటిస్ అవగాహన నెలగా నిర్ణయించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

కాలేయానికి వచ్చే వ్యాధి...

హెపటైటీస్ కాలేయానికి సంబంధించిన వ్యాధి. హెపటైటిస్ బీ వైరస్ ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. ఈ వ్యాధిని కలుగచేసే వైరస్ శరీరంలోకి ఒకసారి వస్తే క్రమేపి వైరస్‌ల సంఖ్య లక్షల్లో పెరిగిపోయి లివర్‌ను దెబ్బతీస్తుంది. వ్యాధిలో ఎ, బి, సి, డి, ఇ రకాలు ఉన్నా వాటిలో బి, సి ప్రాణాంతకం.

వ్యాధి సోకే విధానం...

ఇన్‌ఫెక్ట్ అయిన రక్తపు ఉత్పత్తుల ద్వారా, శరీరంలో ఊరే వివిధ ద్రవాల ద్వారా(వీర్యం, యోని స్రవాలు, మూత్రం) సురక్షితం కాని సంభోగం ద్వారా, అనేక మందితో సంభోగం చేయటం ద్వారా, ఒకరికి వాడిన ఇంజెక్షన్ సూదిని వేరొకరికి వాడటం ద్వారా, టాటూలు వేసుకోవటం, ముక్కు, చెవులు కుట్టుకోవటం, ఒకరేజర్ బ్లేడ్‌ను అనేక మంది వాడటం, ఒకరు వాడిన టూత్ బ్రష్‌ను మరొకరు వాడటం, అసురక్షితమైన రక్తదానం ద్వారా, వైరల్ కల్గి ఉన్న గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు హెపటైటిస్–బి, సి వ్యాధులొస్తాయి. వ్యాధి సోకిన వారిలో తమకు వ్యాధి ఉన్నట్లు ఏ విధమైన లక్షణాలు కనిపించకపోవటంతో వారి ద్వారా ఇతరులకు వ్యాధి సోకుతుంది. వయస్సుతో సంబంధం లేకుండా వ్యాధి సోకే ప్రమాదం ఉంది.

వ్యాధి లక్షణాలు...

కాలేయం వాచిపోయి మూత్రం పసుపుపచ్చగా వస్తుంది. కళ్లు, శరీరం, నాలుక తదితర భాగాలన్నీ పసుపు పచ్చగా మారిపోతాయి. దీనినే పచ్చకామెర్లు అంటారు. వ్యాధి ప్రారంభ దశలో తేలికపాటి జ్వరం, ఆకలి మందగించటం, రక్తపు వాంతులవ్వటం, వ్యక్తి బాగా బలహీనపడటం, పొట్ట ఉబ్బరం, కాళ్లకు వాపులు, కీళ్లనొప్పులు ఉంటాయి. కొంత మంది పరిస్థితి ఇంకా భయంకరంగా ఉంటుంది. శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గిపోతుంది. కాలేయం సరిగా పనిచేయక మృత్యువుకు దారితీస్తుంది.

జిల్లాలో బాధితులు

జీజీహెచ్‌లో హెపటైటిస్ స్క్రీనింగ్ కార్యక్రమం 2020 నవంబరులో ప్రత్యేకంగా ప్రారంభించారు. నాటి నుంచి నేటి వరకు 40,592 మందికి హెపటైటిస్ బీ స్క్రీనింగ్ పరీక్షలు చేయగా, వీరిలో 1,575 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. సీ స్క్రీనింగ్ పరీక్షలు 27,690 మందికి చేయగా, 700 మందికి వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయింది. ప్రతిరోగికి నెలకు సుమారు 20 వేలు ఖరీదు చేసే మందులు జీజీహెచ్‌లో ఉచితంగా అందిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పది మంది గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు వైద్య సేవలు అందిస్తున్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు వారంలో ముగ్గురేసి చొప్పున హెపటైటిస్ బాధితులు చికిత్స పొందుతున్నారు.

వ్యాక్సిన్ చేయించుకోవాలి



హెపటైటిస్ బీ వ్యాధి సోకకుండా ముందస్తుగా వ్యాక్సిన్ చేయించుకోవటం ద్వారా వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చు. కుటుంబంలో ఒకరికి వ్యాధి ఉంటే ఇతర కుటుంబ సభ్యులకు వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ ద్వారా నివారించవచ్చు. హెపటైటిస్–సీ వ్యాధికి వ్యాక్సిన్ లేదు. కాని వ్యాధిని ముందస్తుగా గుర్తిస్తే వైద్యం చేసి నయం చేయవచ్చు. లక్షణలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలి.

– డాక్టర్ షేక్ నాగూర్‌బాషా,
గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, గుంటూరు జీజీహెచ్

లివర్ క్యాన్సర్‌కు దారి తీస్తాయి



శరీరంలో హెపటైటిస్ ఆరు నెలలకంటే ఎక్కువ కాలం ఉంటే క్రానిక్ హెపటైటిస్‌కు దారి తీసి కొన్నేళ్ల తరువాత లివర్ దెబ్బతినడానికి కారణమవుతోంది. దీని వలన లివర్ క్యాన్సర్, లివర్ ఫెల్యూర్, లివర్ సిరోసిస్ వస్తుంది. లివర్ క్యాన్సర్ రావడానికి హెపటైటిస్– బి, హెపటైటీస్– సి వ్యాధులే కారణం. కామెర్ల వ్యాధి సోకిన వారు తప్పనిసరిగా హెపటైటిస్ ఉందా , లేదా అని నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలి.

– డాక్టర్ బైరపనేని స్రవంతి,
క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

సేవకు ప్రతిరూపం మాదల శకుంతల

నగరంపాలెం: సేవకు ప్రతిరూపం మాదల శకుంతల అని, ఆమె కుమారుడు మాదల రత్నగిరిబాబు అన్నారు. మంగళవారం మాదల శకుంతల ప్రథమ వర్ధంతి తారకరామనగర్‌లోని మాదల శకుంతల–భాస్కర్ నర్సింగ్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. మాదల శకుంతల కుమారుడు రత్నగిరి బాబు, మనవడు మాదల చైతన్య, శ్రీరామ్ మాట్లాడుతూ మహిళా లోకానికి స్ఫూర్తి శకుంతల అని పేర్కొన్నారు. పేద ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు. పేద ప్రజల కష్టాలు ఆమె కష్టాలుగా భావించే వారని గుర్తుచేశారు. పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వందలాది మంది వృద్ధులు, అనాథలకు అన్న దానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పాటిబండ్ల శివాజీ, డాక్టర్ పూజ, కుటుంబ సభ్యులు, నర్సింగ్ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.


నూతన వస్త్రాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ రాయపాటి శ్రీనివాస్

తల్లిదండ్రులకు సేవ చేసిన వారికి సౌభాగ్యం


మాట్లాడుతున్న కేవీ కోటేశ్వరరావు

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై జగత్‌గురువు శ్రీశంకరాచార్యులు రచించిన మాతృదేవోభవ అనే అంశంపై రెండు రోజులు జరిగే ప్రవచనాలు మంగళవారం మొదలయ్యాయి. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సి.హెచ్.మస్తానయ్య, ఉపాధ్యక్షులు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి పూటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సుందర సత్సంగ్ సభ్యులు, శ్రీసుందరచైతన్యానందస్వామి శిష్యులు కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ భగవంతుడి ప్రతి రూపమే తల్లి అన్నారు. ప్రాణం ఉన్నంత కాలం తల్లిదండ్రులకు సేవలు చేసిన వారికి సౌభాగ్యం , నిరంతరానందం కలుగుతుందని పేర్కొన్నారు. త్యాగం, ప్రేమ, సేవ, చింతనకు మారుపేరు తల్లి అని అన్నారు. తల్లికి మించిన దైవం లేదన్నారు. సృష్టికి మూలం అమ్మ అని, సృష్టించలేనిది తల్లి గుణం పేర్కొన్నారు. కళ్లకు కనిపించే పర దేవతే తల్లి అని జగత్ గురు శంకరాచార్యులు మాతృపంచకంలో వివరించారని గుర్తుచేశారు. భగవంతుని అమ్మ స్వరూపంతో, మాతృభక్తితో కొలిచినప్పుడు భూలోక సౌఖ్యాలు పొందవచ్చునని అన్నారు. తల్లిదండ్రులను హింసిస్తే కలిగే పాపం నూరేళ్ల సేవ చేసినా తీరదన్నారు. కార్యక్రమంలో మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, చిన్నకేశవరావు, తూనుగుంట్ల సుందరరామయ్య పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిరంతరం నిఘా

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్


శారదా కాలనీవాసులతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన వెస్ట్ డీఎస్పీ అరవింద్

లక్ష్మీపురం: రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే పోలీస్ నిఘా నిరంతరం ఉంటుందని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. వెస్ట్ సబ్ డివిజన్ పరిధిలోని అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లికార్జునపేట ఒకటో లైన్ నుంచి శారద కాలనీ 21వ లైన్ వరకు పాత, కొత్త నేరస్తుల నివాసాల పరిశీలనకు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, వెస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ కె.అరవింద్, సీఐ ఆరోగ్యరాజు, స్పెషల్ బ్రాంచ్ సీఐ అళ్లహరి శ్రీనివాస్‌తో కలిసి మంగళవారం కాలినడకన వెళ్ళి, పర్యవేక్షించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పాత, కొత్త నేరస్తుల పూర్తి వివరాలు పోలీస్ వారి రికార్డుల్లో ఉన్నాయని చెప్పారు. గుంటూరు నగరంలో పోలీస్ గస్తీ ముమ్మరం చేశామని, సామాన్య ప్రజల స్వేచ్ఛకు, శాంతి భద్రతలకు భంగం వాటిల్లకుండా చూడటమే ప్రథమ కర్తవ్యం అన్నారు. ఆ దిశగా తీసుకోవాల్సిన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, నగరంలో ఎక్కడైనా, ఎవరైనా ఎవరైనా అసాంఘిక, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుంటే సదరు సమాచారాన్ని స్థానిక పోలీస్ వారికి గానీ, 112 పోలీస్ అత్యవసర సేవల నెంబర్‌కు గాని ఫోన్ చేసి సమాచారం అందించాలని, సమాచారం తెలుసుకున్న తక్షణమే తగిన రీతిలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. పోలీస్ అధికారులు, సిబ్బంది మీ పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఎల్లప్పుడూ క్షేత్రస్థాయి పర్యటన చేసి ప్రజల సమస్యలను తెలుసుకుని, వాటిని పరిష్కరించే దిశగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐలు కృష్ణబాజీ, ప్రసన్నకుమార్, ఆంజనేయులు, రోజాలత పాల్గొన్నారు.

దేవ్ భట్టాచార్య మృతి తీరనిలోటు

లక్ష్మీపురం: ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్ పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు, మాజీ పార్లమెంటు సభ్యులు దేవ్ భట్టాచార్య మరణం రవాణా రంగ కార్మికులకు తీవ్ర తీరని లోటు అని ఏఆర్‌టీడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షులు నన్నపనేని శివాజీ అన్నారు. సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం దేవ్ భట్టాచార్య చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రవాణా రంగా కార్మికులందరినీ ఒక తాటిపై తీసుకురావడం కోసం తన జీవితం మొత్తం త్యాగం చేసిన గొప్ప వ్యక్తి దేవ్ అన్నారు. అనంతరం రిటైర్డ్ ఆర్టీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కే గంగాధర్, సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.లక్ష్మణరావు, దండా లక్ష్మీనారాయణ, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నాయకులు కురాకుల రాంప్రసాద్, సీఐటీయూ నగర కార్యదర్శి కే శ్రీనివాసరావు, ఆటో యూనియన్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎస్కే మస్తాన్‌వలి, జి.శంకర్ పాల్గొన్నారు. తొలుత భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు.


భట్టాచార్య చిత్రపటం వద్ద నివాళి

వీర జవాన్లు నివాళి

లక్ష్మీపురం: ఆపరేషన్ సిందూర్‌తో మన దేశ సైనికుల శక్తి సామర్థ్యాలు ప్రపంచానికి తెలిసినట్లు అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం వీర జవాన్లకు నివాళి కార్యక్రమం నిర్వహించారు. తొలుత వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పాక్ ఉగ్రవాదులకు ఆపరేషన్ సిందూర్‌తో గట్టి గుణపాఠం చెప్పామన్న ప్రధాని మోదీ మాటలు అక్షర సత్యమన్నారు. రాజ్యాంగ చర్చ వేదిక కన్వీనర్ అవధానుల హరి మాట్లాడుతూ పాక్‌లో తల దాచుకుంటున్న ఉగ్రవాదులపై ఉగ్రవాద స్థావరాల పై దాడిగానే సిందూర్ కొనసాగిందని, లక్ష్యాలను గురి చూసి కొట్టడంలో మన దేశ సైనికులు అసమానమైన ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు.

20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

లక్ష్మీపురం: కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన ఈనెల 20వ తేదీ సార్వత్రిక సమ్మె పిలుపులో భాగంగా ఆటోలు బంద్ పాటించాలని ఆటో సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపునిచ్చింది. మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నన్నపనేని శివాజీ, ఏఐటీయూసీ ఆటో యూనియన్ నగర కార్యదర్శి కురాకుల రాంప్రసాద్, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షులు ఎస్.పవన్ మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్పొరేట్ విధానాలకు వేగవంతం చేస్తుందని చెప్పారు. లేబర్ కోడ్ లను తీసుకురావడం ద్వారా హక్కులను కోల్పోయి కార్మికులను కట్టు బానిసలుగా మార్చడమే ఎన్డీఏ ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జీఓ నంబర్ 21ని తక్షణమే రద్దు చేసి, ఆటో డ్రైవర్లకు కొత్త వాహనాలు తీసుకోవడానికి లోన్లు ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆటో యూనియన్ గౌరవ అధ్యక్షులు మస్తాన్ వలి, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.లక్ష్మణరావు, నగర కార్యదర్శి కే శ్రీనివాసరావు, ఆటో యూనియన్ నగర కార్యదర్శి కె.శంకర్, సీఐటీయూ ఆటో యూనియన్ నాయకులు మురళి, రాంబాబు, రాములు పాల్గొన్నారు.

గ్రంథాలయాలకు పుస్తకాలు అందజేత

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని జిల్లా కేంద్ర గ్రంథాలయం, బృందావన్‌గార్డెన్స్‌లోని మహిళా బాలల గ్రంథాలయానికి విద్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వీబీ ప్రసాద్ లింగం మంగళవారం పుస్తకాలు పంపిణీ చేశారు. అదే విధంగా ఏసీ కళాశాల ఎదుట ఉన్న ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో విద్యార్థులకు ఎమ్మెస్సీ విద్యార్థిని వీవీ కృష్ణ, దేశంలోని ప్రధాన నదులైన బ్రహ్మపుత్ర, నర్మదా నదీ వ్యవస్థలను గురించి వివరించారు.

విశ్రాంత ఉద్యోగి ఇంట్లో చోరీ

లక్ష్మీపురం: విశ్రాంత ఉద్యోగి ఊరి వెళ్లిన సమయంలో చోరీకి పాల్పడిన ఘటనపై మంగళవారం పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. రవీంద్రనగర్ ప్రాంతానికి చెందిన రాధారమణ, రిటైర్డ్ ఉద్యోగి. 6వ తేదీన, సతీమణితో బంధువుల ఇంటికి వెళ్లారు. రోజు వారి ఇంట్లో పని చేసేందుకు పని మనిషి వస్తుందనే ఉద్దేశంతో చిన్నపాటి గేటు, చిన్న తాళాలు ఏర్పాటు చేసి వెళ్లారు. అయితే పని మనిషి కోసం ఏర్పాటు చేసిన తాళాలను పగలగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో ఉన్న రెండు కిలోల వెండి, ఆరు గ్రాముల బంగారం ఆభరణాలు చోరీకి పాల్పడ్డారు. ఇంటి యజమాని రాధారమణ మంగళవారం ఊరి నుంచి ఇంటికి వచ్చి చూసే సరికి ఇంట్లో ఉన్న వెండి, బంగారం కనిపించలేదు. పట్టాభిపురం పోలీసులకు సమాచారం తెలియజేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. విషయం తెలుసుకున్న క్లూస్ టీమ్ చోరీ జరిగిన ప్రదేశంలో పలు కీలక ఆధారాలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏటీ అగ్రహారం, చుట్టుగుంట అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ


ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న మేయర్ రవీంద్ర

నెహ్రూ నగర్: ఏటీ అగ్రహారం రోడ్డు విస్తరణ, చుట్టుగుంట చెరువు అభివృద్ధి పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయటానికి ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు సమన్వయంతో ప్రజాప్రతినిధుల సహకారంతో చర్యలు తీసుకోవాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర అధికారులను కోరారు. మంగళవారం నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, అధికారులతో కలిసి చుట్టుగుంట చెరువు దగ్గర నుంచి కంకరగుంట ఆర్‌యూబీ వరకు జరుగుతున్న విస్తరణ, అభివృద్ధి పనులు పరిశీలించి, సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తొలుత చుట్టుగుంట చెరువు, వాకింగ్ ట్రాక్‌లో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. మేయర్ మాట్లాడుతూ పనులు వేగవంతం చేయాలని కోరారు. ఏటీ అగ్రహారం రోడ్డు విస్తీర్ణం మాస్టర్ ప్లాన్ మేరకే జరగాలన్నారు. విస్తరణ పూర్తయిన ప్రాంతాలలో తక్షణమే డ్రెయిన్‌లు, రోడ్డు, సెంట్రల్ డివైడర్ నిర్మాణం చేపట్టాలని సూచించారు. కోర్టు కేసుల వలన విస్తరణ నిలిచిన ప్రాంతాలలో స్థానిక కార్పొరేటర్ల సహకారంతో మాట్లాడి, విస్తరణకు చర్యలు చేపట్టాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఏటీ అగ్రహారం విస్తరణ పనులు జరిగిన ప్రాంతంలో రోడ్డుల నిర్మాణానికి కాంట్రాక్టర్ పనులు చేసేలా ఇంజినీరింగ్ అధికారులు బాధ్యత తీసుకోవాలన్నారు. విస్తరణలో ప్రభావితమైన భవనాలకు నష్టపరిహారం, స్థలాలకు, టి.డి.ఆర్ బాండ్లు వేగంగా అందించుటకు చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించారు. పర్యటనలో ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎం ఓహెచ్ డాక్టర్ అమృతం, ఈఈ కోటేశ్వర రావు, డి.సి.పి. సూరజ్ కుమార్, కార్పొరేటర్లు ఈరంటి వరప్రసాద్, అడకా పద్మావతి, అచ్చాల వెంకట రెడ్డి పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో భాష్యం బ్లూమ్స్ విజయభేరి


విద్యార్థులతో భాష్యం హనుమంతరావు, సాకేత్‌రామ్

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ–2025 టెన్త్ ఫలితాల్లో భాష్యం బ్లూమ్స్ విద్యార్థులు సంచలన ఫలితాలు నమోదు చేశారని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ తెలిపారు. మంగళవారం గుంటూరు చంద్రమౌళినగర్‌లోని మెయిన్ క్యాంపస్‌లో సీబీఎస్ఈ టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. భాష్యం బ్లూమ్స్ విద్యార్థి ఎస్‌కేఎం శ్రీహర్ష 500 మార్కులకుగానూ అత్యధికంగా 492 మార్కులు సాధించి భాష్యంకు గర్వకారణంగా నిలిచారన్నారు. అదే విధంగా ఎ.సాయినిఖిత 490, టి.అనీష్ 489, బి.లిఖిత్ మనోఘ్న 488, పి.శ్రీసాయి మిత్ర 488, ఎ.శ్రీహరిణి 488, యు.యశ్వంత్ సాయి 486, కె.స్నిగ్ధ 485, ఎస్.మణి యశ్వంత్ 485, పీయూష్ ఫోడికర్ 485, ఇ.రిషిక 485, డి.శ్రీహరిణి 485 వంటి అత్యుత్తమ మార్కులతో విశేష ప్రతిభ కనబరిచారన్నారు. 480కు పైగా 23 మంది, 470కు పైగా 63 మంది, 450కు పైగా 146 మంది విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారన్నారు. ఇంతటి ఘనవిజయానికి తోడ్పడిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ అభినందనలు తెలిపారు.

టెన్త్ ఫలితాల్లో 'సీతారామయ్య' సత్తా


విద్యార్థులతో విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ బోర్డు మంగళవారం ప్రకటించిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో శ్రీ పాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ హైస్కూల్ విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో మంగళవారం విద్యార్థుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మూడో బ్యాచ్ నుంచి పరీక్షలు రాసిన 80 మంది విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించడమే కాకుండా సబ్జెక్టుల వారీగా గణితం, తెలుగులో నూరు శాతం మార్కులు సాధించినట్లు వివరించారు. అదే విధంగా ఇంగ్లిష్‌లో 98, సోషల్‌లో 98, ఐసీటీలో 99 వంటి టాప్ మార్కులతో విజయకేతనం ఎగురవేశారని వివరించారు. విద్యార్థిని విశ్వనాథం వెంకట వాసవి స్వప్న రాగ 500 మార్కులకు 478, పొన్నెకంటి శ్రావణి 473, సన్నిబోయిన కీర్తన 472, కొర్ల బాలవర జోషిత 458, గమిని మోహన్ శ్రీకృష్ణ 456 మార్కులతో తొలి ఐదు స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. క్రమబద్ధమైన విద్యాప్రణాళిక, ఉపాధ్యాయుల ఉత్తమ బోధన, విద్యార్థుల కృషి, పట్టుదలతో తిరుగులేని ఫలితాలను సాధించినట్లు పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, అధ్యక్షుడు దేవినేని మల్లికార్జునరావు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ళ కృష్ణవేణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కోఆర్డినేటర్ దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.

కేఎల్పీ స్కూల్ విద్యార్థుల ప్రతిభ..


విద్యార్థులతో కృష్ణప్రసాద్, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ పదో తరగతి, 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్పీ స్కూల్లో విద్యార్థుల అభినందన మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టెన్త్, ప్లస్‌టూ ఫలితాల్లో నూరు శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు తెలిపారు. ప్లస్‌టూ పరీక్షలకు హాజరైన 70 మంది విద్యార్థుల్లో 34 మంది ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులు కాగా, 14 మంది డిస్టింక్షన్‌లో మార్కులు సాధించారని వివరించారు. 10వ తరగతి పరీక్షలు రాసిన 144 మంది విద్యార్థుల్లో 127 మంది ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులవ్వగా, 64 మంది డిస్టింక్షన్‌లో ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 15 మంది విద్యార్థులు 90 శాతానికి పైగా మార్కులు సాధించారని, విద్యార్థిని పి.సాత్విక 500 మార్కులకు 482 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు అత్యుత్తమ విద్యను అందిస్తున్నామని, పోటీ పరీక్షలకు ఉత్తమ శిక్షణతో అత్యుత్తమ ఫలితాలు సాధించారని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణసాద్, ఏవో కె. వెంకట్రావు, ప్రిన్సిపాల్ జి.రత్తయ్య, అకడమిక్ కో–ఆర్డినేటర్ బి.శైలజ, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ బోర్డు మంగళవారం ప్రకటించిన పదో తరగతి, 12వ తరగతి పరీక్షా ఫలితాల్లో అమరావతిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నూరు శాతం ఉత్తీర్ణత నమోదు చేసినట్లు పాఠశాల డైరెక్టర్ చుక్కపల్లి రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తరగతిలో శ్రీ సాయి దారహాస్ 96.2 శాతం, కొమ్మనబోయిన మహేష్ కుమార్ 94.2 శాతం, కౌశిక్ సాయి పబ్బిసెట్టి 91 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనట్లు వివరించారు. అదే విధంగా 10వ తరగతిలో చల్లా లలిత శరణ్య 98.4 శాతం, నిధి తోష్నివాల్ 97.4 శాతం, ఈపూరి విజయసారథి 96.4 శాతం మార్కులు సాధించారని పేర్కొన్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రో వైస్ చైర్మన్ చుక్కపల్లి రమేష్, డైరెక్టర్లు చుక్కపల్లి రాకేష్, చుక్కపల్లి ప్రియాంక, అకడమిక్ డైరెక్టర్ ఉషారాణి, ప్రిన్సిపాల్ రత్నమాల విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను అభినందించారు. ఈ విజయం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషి, అంకితభావం, నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ..

గుంటూరు ఎడ్యుకేషన్: సీబీఎస్ఈ బోర్డు మంగళవారం ప్రకటించిన టెన్త్ పరీక్ష ఫలితాల్లో ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి వై.సంపత్‌రెడ్డి 500 మార్కులకు అత్యధికంగా 483, ఆర్.హనీష్ 477 మార్కులు పొందినట్లు వివరించారు. 450కు పైగా 10 మంది, 400కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 40 మంది ఉన్నారని తెలిపారు. ఈసందర్భంగా విజ్ఞాన్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, జోనల్ ఇన్‌చార్జి అనూరాధ అభినందించారు.